బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

- మే 5 నుంచి దేవరపల్లి ఆలయంలో ఉత్సవాలు
- 7న శ్రీనివాసుని కల్యాణం

దేవరపల్లి: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవరపల్లిలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 2022 మే 12న శ్రీవారి ఆలయ ప్రతిష్ఠాన జరిగింది. దాతల సహకారంతో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి నిత్యం ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. చుట్టుపక్కల 20 గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ప్రతి శనివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుంది. వివిధ గ్రామాల నుంచి భక్తులు కాలినడక ఆలయానికి చేరుకుని మొక్కలు తీర్చుకుంటున్నారు. ఏటా మే నెలలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పండుగల సమయంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ వివిధ సేవలు చేస్తున్నారు.

8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

మే నెల 5 నుంచి 8 వరకు శ్రీవారి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 5వ తేదీ ఉదయం 6 గంటలకు శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తిరుమంజనం, స్వామి వారి తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. 6వ తేదీన ఉదయం 6 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, కుంభకళ ఆవాహనం, నిత్యహోమం, 7.30 గంటలకు గరుడ వాహన ఉత్సవం, 7న ఉదయం 8 గంటలకు విష్వక్సేనారాధన, కుంభారాధన, నిత్య హోమం, శ్రీవారి రథోత్సవం, నివేదన మంగళ శాసనం, సాయంత్రం 5 గంటలకు నిత్యారాధన, కుంభారాధన, నిత్యహోమం. సాయంత్రం 7 గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారుల బృందంతో అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం నిర్వహించనున్నారు. 8వ తేదీన కుంభారాధన, నిత్యహోమం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, మహాపూర్ణాహుతి, కుంభ కళాన్యాసం, వేద ఆశీర్వచనం, రాత్రి 8.30 గంటలకు శ్రీవారి ఊంజల్ సేవ, శ్రీపుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 10వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి శ్రీవారి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందన్నారు.


శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు


దేవరపల్లిలో బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న శ్రీవారి ఆలయం


దేవరపల్లిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి

క్లుప్తంగా

మానవత ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న నల్లజర్లకు చెందిన పారేపల్లి నేహాంత్ (10)కు మండల మానవత సంస్థ సభ్యులు సోమవారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అతని పరిస్థితిని చూసి చలించిన మానవత జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ రూ.వెయ్యి, మరో సభ్యుడు నందం రాజేంద్రప్రసాద్ రూ.వెయ్యి అందజేసారు.అనంతపల్లిలో జొన్నకూటి రామకృష్ణకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసారు. మొత్తం రూ.12వేలు అందించారు. ఈ కార్యక్రమంలో భోగవల్లి వెంకటసుబ్బారావు, గుల్లపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, పాతూరి సత్యనారాయణ, ఐడీవీ అప్పారావు, ఓలిరెడ్డి సతీష్, చిటికిన రామారావు పాల్గొన్నారు.

తలారిని కలిసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు


దేవరపల్లిలోని తలారి వెంకట్రావును కలిసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ సారథి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ ఎం.విజయ సారధి గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం సమన్వయకర్త తలారి వెంకట్రావును దేవరపల్లిలోని ఆయన నివాస గృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొవ్వూరు నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యలు పరిష్కారానికి సహాయ సహకారం అందించాలని తలారి వెంకట్రావును కోరినట్టు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చాన్‌బాషా



నిడదవోలు : వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎస్‌కే చాన్‌బాషా నియమితులైన సందర్భంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఛాన్‌బాషా 1997లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడుగా, 2003-05 వరకు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీలో నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌ఛార్జిగా పార్టీకి సేవలందించారు. సందర్భంగా చాన్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, నియోజకవర్గ ఇన్‌చార్జి జి.శ్రీనివాసనాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలను అంకితభావంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెరవలి: మల్లేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మల్లేశ్వరం, పిట్టల వేమవరం, కండిపాడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ డీఈ ఎన్ నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు. ఈ గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో మే 3న జాబ్‌మేళా

నిడదవోలు : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడం కోసం మే నెల 3న పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో భాగంగా 1,302 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా రూ.12,000 నుంచి రూ.40,000 వరకు జీతం పొందవచ్చన్నారు. 45 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పాసై మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువత ఈ అవకాశం సద్వినియోగించుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 35 ఏళ్లలోపు ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడెటా, విద్యార్హత, సర్టిఫికెట్లతో మే 3న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసుపై హైకోర్టుకు వెళ్తాం

కొవ్వూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ హైకోర్టులో వెళుతున్నామని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు.లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్, మాజీఐఏఎస్ అధికారి ఆర్.విజయ్‌కుమార్ ఇప్పటికే దీనిపై ప్రకటన చేశారని శ్యాం రవిప్రకాష్ తెలిపారు. ప్రవీణ్ మద్యం సేవించి ప్రమాదానికి గురైనట్లు పోలీసులు పేర్కొనడం బాధకరమని అన్నారు. ఇప్పటికే కేఏ పాల్ హైకోర్టులో కేసు వేశారన్నారు. భవిష్యత్తులో న్యాయపోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని శ్యాం రవిప్రకాష్ ప్రకటించారు.

బోద వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి


ఉండ్రాజవరం పీహెచ్‌సీలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, డాక్టర్ ఆర్ ప్రసాద్

ఉండ్రాజవరం: డాక్టర్ల సలహా మేరకు బోద వ్యాధిగ్రస్తులు తగిన సూచనలు, సలహాలు పాటించాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అవసరమైన కిట్లను సోమవారం ఎంపీపీ యల్లారేశ్వరి, పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ ఎస్ఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. బోద వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాస్ బోద కాలు పుండు పడకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


తాళ్లపూడిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

తాళ్లపూడి: కశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తాళ్లపూడి మసీదు కమిటీ గౌరవాధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్ అన్నారు. తాళ్లపూడిలో సోమవారం కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించారు. బజార్‌సెంటర్ మీదుగా ప్రక్కిలంక, పైడిమెట్ట సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్థిల్లాల్లి అంటూ నినాదాలు చేసారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, మండల నూర్‌బాషా ప్రెసిడెంట్ షరీఫ్, ముస్లింలు సర్దార్, ఇస్మాయిల్, రజాక్, అన్వర్, ఉమర్, రావూఫ్ పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌తో ఎన్నో ప్రయోజనాలు


పెరవలిలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ దేవిడ్ నిశ్చల్

పెరవలి: ప్రదాన మంత్రి సూర్య ఘర్ పథకం ఎంతో మేలు అని దీని వలన అనేక ప్రయోజనాలున్నాయని ఎలక్ట్రికల్ ఏఈ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. పెరవలి వెలుగు కార్యాలయంలో సోమవారం గ్రామ వీఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో లబ్ధిదారులతో ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకంలో మూడు రకాల ఉన్నాయని ఒక కిలో వాట్, రెండు, మూడు కిలోవాట్‌లు కలిగిన పథకమని తెలిపారు. మూడు కిలోవాట్‌లు ఏర్పాటు చేసుకుంటే నిరంతరం విద్యుత్ లభ్యమవుతుందని, దీని వల్ల రెండు ఏసీలు లేదా 8 ఫ్యాన్లు, 8 బల్బులు వెలుగుతాయని తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారులు బ్యాంక్ రుణం పొందవచ్చని ప్రభుత్వ సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణం పొందిన తరువాత ప్రతి నెలా చెల్లించేలా పథకం రూపొందించారన్నారు. ఏపీఎం బి.రామకృష్ణ మాట్లాడుతూ పథకం ఎంతో మంచిదని దీనిని లబ్ధిదారులకు వివరించాలని అందుకు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. బ్యాంక్ రుణం పొందలేని వారు నేరుగా తమ శాఖ ద్వారా రుణం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, సీసీలు, విద్యుత్ సిబ్బంది, వీఓలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 47 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం


పెరవలిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు

పెరవలి: జిల్లాలో రాబోయే ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం 30 వేల మంది రైతులతో 47 వేల ఎకరాల్లో సాగు చేసేలా లక్ష్యం నిర్ణయించామని అందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు తెలిపారు. పెరవలిలో జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముందస్తు ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం వరి 37 ఎకరాలు, వాణిజ్య పంటలు 10 వేల ఎకరాల్లో సాగు చేపట్టేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో 47 వేల ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయటానికి సిద్ధమయ్యామని అందుకు రైతులకు కిట్‌లను అందించామన్నారు. ఈ కిట్‌లు తీసుకున్న ప్రతి రైతు తమ పొలంలో 30 రకాల నవ ధాన్యాలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని అందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. దీని వలన రైతులకు పెట్టుబడి తక్కువ అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. నవధాన్యాల సాగు వలన పంట భూములు గుల్లబారి రాబోయే పంటలకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. నవధాన్యాల సాగు వలన ప్రతి ఎకరానికి 2 టన్నుల ఎరువు లభించడంతో పాటు పశువులకు పచ్చిరొట్ట గ్రాసం లభిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలపై మందులు పిచికారీ చేయటానికి డ్రోన్ వినియోగించాలన్నారు. జిల్లాలో 18 మండలాల్లో ఒక్కొక్క మండలంలో 3 వేల ఎకరాలు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ సాకా రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

- సూపర్ సిక్స్ అమలు చేయలేని అసమర్థ సీఎం చంద్రబాబు
- పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


చాగల్లులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలవుతున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయలేని అసమర్థ సీఎం చంద్రబాబు రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులో శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మండలస్థాయి విస్తృత సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే రీతిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో రాష్ట్ర భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఇప్పటికే రాజధాని కోసం సేకరించిన భూమిలో అభివృద్ధి పనులు చేయలేదని, రైతులకు ప్లాట్లు కేటాయించలేదని, మళ్లీ ల్యాండ్ పూలింగ్, భూసేకరణ అంటున్నారని మండిపడ్డారు. 2014-19 టీడీపీ పాలనలో గోపాలపురం నియోజవర్గంలో నల్లజర్ల మండలంలో 533 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్క్ కేటాయిస్తున్నామంటూ సేకరించారని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ భూములను ఎస్సీ, ఎస్టీ పేదలకు పంచామన్నారు. గతంలో రాజధాని పేరుతో ప్రధాని మోదీ మట్టి, నీరు తెచ్చారని, ఇప్పుడు పునర్నిర్మాణం అంటూ మరో డ్రామాకు తెరలేపుతున్నారని విమర్శించారు.

99 పైసలకే ఎకరా భూమి

చంద్రబాబు పాలనలో 99 రూపాయలకే క్వార్టర్ మద్యం బాటిల్, 99 పైసలకే ఎకరా భూమి ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.కోట్లు విలువైన భూమిని 99 పైసలకే ఇవ్వొచ్చని నిరూపించిన ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబేనని విమర్శించారు. మెగా డీఎస్సీ పేరుతో తొలి సంతకం చేసిన చంద్రబాబు ఇప్పుడు 16 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను వంచించారన్నారు. తల్లికి వందనం అమలుపై చంద్రబాబు మాట తప్పారని ఆయన మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదని మండిపడ్డారు.

కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు

రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. సమర్థవంతంగా పని చేసే వారికి గ్రామ కమిటీ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. మండల, జిల్లా, గ్రామ స్థాయి కమిటీల్లో, అనుబంధ కమిటీల నియామకంలో పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న నాయకులకు అవకాశం కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలో గ్రామాల వారీగా కమిటీల ఏర్పాటుపై నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగ్రోతు సురేంద్ర కుమార్, ఎంపీపీ మట్టా వీరస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్ట కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, ఎంపీటీసీ ఆతుకూరి గోపీచంద్, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జాలి వెంకట్రావు, గెడా శ్యామ్, ముప్పిడి మహాలక్ష్మిడు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగులు

నిడదవోలు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిడదవోలు ఆర్టీసీ డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం దశల వారీ రిలే నిరాహర దీక్షలు చేపట్టారు. మొదటి రోజు ఉద్యోగులు దాసరి రంగారావు, కే రమేష్, కారింకి వెంకటేష్, ఆర్‌వీ రావు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నిడదవోలు ఆర్టీసీ డిపో కార్యదర్శి ఆర్‌వీ రావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెందిన 38 సమస్యలపై రాష్ట్ర కార్యవర్గం మేనేజ్‌మెంట్‌కు నోటీసు ఇచ్చినా స్పందన లేని కారణంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారీగా ఆందోళనలో భాగంగా నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. ప్రధానంగా 1/2019 సర్క్యులర్ పటిష్టంగా అమలు చేయాలని, పదోన్నతులను కల్పించాలని, గ్యారేజ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన వివిధ రకాల సెలవులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రీజియన్ కార్యదర్శి ముఖర్జీ మాట్లాడుతూ యాజమాన్యం మొండివైఖరిని నిరసిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి ధనరాజు, డిపో సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాస్, సురేష మహిళా కన్వీనర్లు ఎ. సత్యవతి, లక్ష్మీదేవి, జోనల్ అధ్యక్షులు డీఎంఆర్ రాజు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి. తుని నుంచి కాకినాడ రిలివింగ్‌కు వెళ్లిన డ్రైవర్లను వెనక్కి పంపాలని డిపో కార్యదర్శి శివ కుమార్ తెలిపారు. మొదటి రోజు రిలే దీక్షల్లో యూనియన్ జోనల్ అధ్యక్షుడు డీఎంఆర్ రాజు, రీజనల్ కార్యదర్శి ఎస్‌డీ ముఖర్జీ, రీజనల్ అధ్యక్షుడు సీహెచ్ ఎస్ రాజు, డిపో కార్యదర్శి ఎం.శివ కుమార్, సీసీఎస్ డెలిగేట్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యం వహించారు.

యూపీఎస్సీ ర్యాంకర్ వినయ్‌కు అభినందనల వెల్లువ


యూపీఎస్సీలో 274వ ర్యాంకు సాధించిన వినయ్‌ను అభినందిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: సివిల్ సర్వీసెస్ అధికారిగా దొమ్మేటి వినయ్ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆకాంక్షించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2024 (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్‌లో 274వ ర్యాంకు సాధించిన వినయ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సోమవారం ఆర్డీవో అభినందనలు తెలిపారు. వినయ్‌కు అభినందనలు తెలిపారు. తన ప్రతిభ ద్వారా కొవ్వూరు పట్టణానికి పేరు తెచ్చిన వినయ్‌ను స్థానిక ప్రముఖులు అభినందనలు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మేనేజర్ సాయిబాబా, ఇతర సిబ్బంది వినయ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి సత్కరించారు. వినయ్ తలిదండ్రులు కొవ్వూరు టౌన్ ఏఈ (డీ-1) గా పనిచేస్తున్న దొమ్మేటి జగదీశ్వరరావు, దుర్గ దంపతులకు అభినందనలు తెలిపారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

నిడదవోలు రూరల్: విద్యాహక్కు చట్టం అనుసరించి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పేద పిల్లలకు అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కేవీ గణేష్ సోమవారం తెలిపారు. కనీసం 25 శాతం సీట్లు బలహీనవర్గాల పిల్లల కోసం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. 2025-26 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో 1వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంధులు, హెచ్ఐవీ బాధితులు, ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీ వర్గాలు అర్హులని తెలిపారు.

1 నుంచి వాలీబాల్ శిక్షణ

కొవ్వూరు: మే నెల 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు పట్టణంలో ఉచిత వాలీబాల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ,జిల్లా వాలీవాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగుతుందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి రాఘవేంద్రరావు తెలిపారు. శిక్షణా శిబిరంలో 75శాతం హాజరు పొందిన విద్యార్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా సర్టిఫికెట్లు, క్రీడాకారులకు జత క్రీడా దుస్తులు అందజేస్తామన్నారు. మిషన్ ఎస్‌జీఎఫ్ఐ-2025,-ఏపీ వాలీబాల్ నినాదంతో బాల,బాలిక జట్లను సిద్ధం చేస్తామని ఆయన తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామని గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని చిన్ని తెలిపారు.అవంతీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా శిబిరం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నామని క్యాంపు ఇన్‌చార్జ్ కొయ్యల ప్రసాద్ తెలిపారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ చైర్మన్ జి.సుశీల సోమవారం ప్రారంభించారు. జూన్ వరకు 40 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని గ్రంథపాలకురాలు ఏవీ రమణ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ జి.శ్రీరామ్మూర్తి, కూచిపూడి పద్మావతి, ఏ.శ్రీహరి, యం.యం.వి.ప్రసాద్, రీడర్స్ పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నరేష్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రథాలయ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. రిటైర్డ్ ఎంఈవో సీహెచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

దేవరపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యర్నగూడెం శాఖా గ్రంథాలయం అధికారిణి అనిత కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. 40 రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు వివిధ అంశాల్లో నిపుణులు, ఉపాధ్యాయులతో శిక్షణనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు యాదాల కిషోర్, పాలూరి వెంకట చరిత బాలాజీ, బొల్లిన విజయ భాస్కర్ పాల్గొన్నారు.

కొవ్వూరులో గ్రేడ్-1 గ్రంథాలయంలో..

కొవ్వూరు: గ్రంథాలయాల్లో నలభై రోజులు పాటు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్స సభలో కమిషనర్ పాల్గొన్నారు. సోమవారం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథ్ మండల విద్యా శాఖాధికారి-2 శ్రీరామ్ కుమార్, సంస్కృత పాఠశాల రిటైర్డు హెచ్ఎం గోవర్ధనం శ్రీనివాసమూర్తి,రాధాలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాభివృద్ధి

పెరవలి: గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాభివృద్ధి సాధించవచ్చని రిటైర్డ్ లైబ్రేరియన్ సలాది సూర్యనారాయణ తెలిపారు. పెరవలి మండలంలో వేసవి శిక్షణా శిబిరాలను సోమవారం ముక్కామల, పెరవలి, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో ప్రారంభించారు. లైబ్రేరియన్లు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించండి

కొవ్వూరు: అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రజలను నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అర్జీదారులు మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు అందజేయవచ్చని సూచించారు. అర్జీదారులు 1100 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి సమస్యలను తెలపవచ్చని అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించి న పీజీఆర్ఎస్ - మీకోసం కార్యక్రమంలో ఏడు అర్జీలు అందాయన్నారు. ఎక్కువగా రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధిచిన అర్జీల అందాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: యర్నగూడెం గండిచెరువు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇంజే సురేష్ బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన గల ఫెన్సింగ్ స్తంభాన్ని ఢీ కొట్టాడు.ఈ ప్రమాదంలో సురేష్ తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

కోర్టు ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం

కొవ్వూరు: పట్టణంలో కోర్టు ప్రాంగణంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.సీనియర్ న్యాయవాది నూతి వెంకటసుబ్బారావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్రే నాగ మురళీకృష్ణ, ఏఐఎల్‌యూ సభ్యురాలు పీవీపీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.